# ఘోరంగా వంచించబడిన భోపాల్ గ్యాస్ బాధితులు

**విషాదకరమైన** భోపాల్ పారిశ్రామిక దుర్ఘటన జరిగి 30 సంవత్సరాలు గడిచింది. భోపాల్‌లోని యూనియన్‌కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి వెలువడిన ప్రమాదకరమైన మిథైల్ ఐసోసైనైట్(మిక్) అనే విష వాయువు కారణంగా పదివేలమంది సమీప ప్రాంతాల ప్రజానీకం మరణించగా, తదనంతర కాలంలో ఈ దుష్ప్రభావం ఫలితంగా మరో 20 వేలమంది చనిపోయారు; ఇంకో 25 వేలమంది ఈ దుష్ప్రభావానికి గురై అదుపులేని అనేక వ్యాధుల బారినపడి జీవచ్ఛవాలుగా బతుకులీడుస్తున్నారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వం 2010 సం॥రంలో అందజేసిన సమాచారం ప్రకారం 4,31,495 మంది ప్రమాదకర విషవాయువు కారణంగా తీవ్ర అస్వస్థతకు గురైన రోగులు ఆసుపత్రులలో చికిత్స పొందారు. విషకాలుష్యం భూగర్భజలాలను కలుషితంచేసిన కారణంగా, భోపాల్ యూనియన్ కార్బైడ్ పరిశ్రమ పరిసర ప్రాంతాల్లోని కుటుంబాలలో జన్మించిన పిల్లలు టి.బీ., క్యాన్సర్‌వంటి వ్యాధులకు; మహిళలు పునరుత్పత్తి సమస్యలకు, ప్రసవ సందర్భంగా సంభవించే వ్యాధులకు; నవజాత శిశువులు మానసిక, భౌతిక వైకల్యాలకు గురయ్యారు.

శాస్త్రవేత్తల పరిశీలన ప్రకారం, భోపాల్ యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ఆవరణలోనే విషపూరిత వ్యర్థాలను నిల్వవుంచిన ఫలితంగా వీరందరికీ ఈ వ్యాధులు సంక్రమించాయని తెలుస్తోంది.

ఈ విధంగా భోపాల్ పారిశ్రామిక దుర్ఘటన, భోపాల్ పరిసర ప్రాంతాలలోని జీవమున్న యావత్ ప్రాణులన్నింటినీ సర్వనాశనం చేసింది. ఈ వినాశన తీవ్రత ఎంతటిదంటే, తరాలుగడుస్తోన్నా దాని ప్రభావానికి ఈనాటికీ ప్రజలు ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

అమెరికాకు చెందిన యూనియన్ కార్బైడ్ యాజమాన్యం, ప్రమాదం ముసుగులో ఈ వినాశనాన్ని సృష్టించిందనేది స్పష్టమే. సామ్రాజ్యవాదులు–ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచాధిపత్యంకోసం వివిధ దేశాలపై యుద్ధాలు, దాడులు సాగిస్తూ, నూతన తరహా జీవరసాయన ఆయుధాల తయారీకోసం ప్రయోగాలు సాగిస్తూవుంది. అందులో భాగంగా, మిథైల్ ఐసోసైనైట్‌ను ప్రాణులపై, ముఖ్యంగా మానవులపై ప్రయోగించి పరీక్షచేశారని, భోపాల్ ప్రజానీకాన్ని ప్రయోగ పశువులుగా ఉపయోగించారనేది నిరాకరించ వీలుకాని, స్పష్టంగా రుజువైన వాస్తవం.

అయితే, అమెరికాకు చెందిన యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ యాజమాన్యంగానీ, అమెరికా సామ్రాజ్యవాద పాలకులుగానీ లేక వారి అత్యున్నత ప్రజాస్వామిక, స్వేచ్ఛాయుత న్యాయవ్యవస్థగానీ భోపాల్ గ్యాస్ బాధితులకు న్యాయంచేకూర్చేందుకు ఏ కోశానా ప్రయత్నించలేదు; అదేవిధంగా భోపాల్‌లోని విషపూరితమైన వాతావరణాన్నీ, భోపాల్ యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో మిగిలిపోయిన విషవ్యర్థాలను తొలగించి, చక్కదిద్దే కనీసపాటి ప్రయత్నాలు చేయలేదు. పైగా, అత్యంత మోసకారీతనంతో యుసిసి యాజమాన్యం భోపాల్‌లోని తన కంపెనీని డౌ కెమికల్స్‌కు అమ్మివేసి, భోపాల్‌లో 'మిక్' విషవాయువును వెలువరించి, ఇంతటి ఘోరం జరిపిన తనపై వచ్చిన నేరారోపణను ఎగవేయటానికి కుటిలంగా వ్యవహరించింది. కాగా, భోపాల్ దుర్ఘటనతో తనకేం సంబంధం లేదని డౌ కెమికల్స్ నిరాకరించింది. భారత బడాబూర్జువా వర్గ ప్రతినిధులు కూడా డౌ కెమికల్స్ యాజమాన్యాన్నే సమర్థిస్తూ భోపాల్ దుర్ఘటన నుండి దాని బాధ్యతను కూడా తప్పించారు.

మరోవైపున, భారత 'స్వతంత్ర' 'ప్రజాస్వామిక' పాలకులు నాటి ఇందిరాగాంధీ మొదలుకొని నేటి మోడీ వరకూ అమెరికా సామ్రాజ్యవాద లొంగుబాటు దారులుగా తమకు తాము రుజువుచేసుకుంటున్నారు. అంతేగాక బాధితులైన మనదేశ పౌరులకు న్యాయం జరిగేవిధంగా పోరాటడంలోనూ ఘోరమైన ఉద్దేశ్య పూర్వక నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. 'మిక్' వాయువు వెలువడిన పరిశ్రమ ప్రాంతంలో ఈనాటికీ 300 టన్నుల విష రసాయనాలు సమస్యను సృష్టిస్తున్నప్పటికీ, దానిని శుద్ధిచేయించటంకోసం వారే మాత్రం ప్రయత్నం చేయటంలేదు. విషవ్యర్థాలను శుద్ధిచేసేపేరిట, విష వ్యర్థాలలో కొంత భాగాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అనేక గ్రామాలకు తరలించటం జరుగుతోంది. ఈ విధంగా ఆ ప్రాంతాలను తిరిగి కలుషితం చేయటమే గాక, ఈ విషకాలుష్య సమస్యను గ్రామీణ ప్రజానీకంపై రుద్దుతున్నారు.

యూనియన్ కార్బైడ్ సంస్థను భవిష్యత్తులో బాధ్యత వహించాల్సిన సమస్యలన్నింటి నుండి విముక్తం చేస్తూ కేవలం 47 కోట్ల డాలర్ల (సుమారు 2820 కోట్ల రూ॥) మొత్తంతో పరిష్కారానికి కేంద్ర పాలకులు అంగీకరించారు. భారతదేశ సార్వభౌమాధికారం గురించి చాలా గొప్పగా ప్రకటించుకునే వీరు ఈవిధంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి, సామ్రాజ్యవాద కార్పొరేషన్లకు దళారులుగా నిస్సిగ్గుగా మరోసారి రుజువుచేసుకున్నారు. బాధితులకు పరిహారంగా పాలకులు అంగీకరించిన మొత్తం, జరిగిన నష్టాన్ని పరిగణలోకి తీసుకుంటే చాలా స్వల్పమైనది.

2011 ఏప్రిల్ 20న మెక్సికో గల్ఫ్‌లోని భారత పెట్రోలియం బావిలో పేలుడు సంభవించి 11 మంది కార్మికులు చనిపోయారు. లక్షల బ్యారెళ్ళ చమురు అమెరికాలోని ఐదురాష్ట్రాల సముద్రతీర ప్రాంతాలలో తెట్టులాగ చేరుకుంది. పర్యావరణ నష్టం జరిగినందుకు

గాను, దీనిని శుద్ధిచేసేందుకుగానూ అమెరికాలోని ఐదురాష్ట్రాలు, భారత్ పెట్రోలియం సంస్థతో 18.7 బిలియన్ డాలర్లను (సుమారు 1,12,200 కోట్ల రూ॥) నష్టపరిహారంగా కట్టించాయి. 2015 జులైలో ఈ పరిష్కార ఒప్పందం చేసుకున్నాయి.

భోపాల్‌లో జరిగిన వినాశనాన్ని, మెక్సికో గల్ఫ్‌లో జరిగిన నష్టంతో పోలిస్తే ఇది చాలా చిన్ననష్టం క్రింద పరిగణించాలి. యూనియన్ కార్బైడ్ (యుసిసి) వలన జరిగిన వినాశనంయొక్క విస్తృతి చాలా అధికం కూడా. కాగా, నష్టపరిహార పరిష్కార ఒప్పంద విషయానికొస్తే భారత్ పెట్రోలియంకు, అమెరికాకు జరిగిన ఒప్పందంతో పోలిస్తే యుసిసికి భారత ప్రభుత్వానికి మధ్యకుదిరిన ఒప్పందం అత్యంత స్వల్పమైనది.

ఈవిధంగా మూడవ ప్రపంచదేశాలకు న్యాయం కల్పిస్తాననే విషయంలో అమెరికా సామ్రాజ్యవాదం యొక్క వంచన మరోమారు బట్టబయలు అయింది. భోపాల్ బాధితులకు న్యాయం పూర్తిగా నిరాకరించబడింది.

అమెరికాకు, భారత్ పెట్రోలియం సంస్థకు నడుమ జరిగిన పరిష్కార ఒప్పందం తర్వాతనైనా భోపాల్ గ్యాస్ బాధితుల నష్టపరిహార అంశాన్ని మరోసారి బలంగా ముందుకు తీసుకురావటానికి మన పాలకులు ఎలాంటి ప్రయత్నాలూ చేయటంలేదు.

1985లో భారత ప్రభుత్వం అడిగిన 3.3. బిలియన్ డాలర్ల (సుమారు 19,800 కోట్ల రూ॥) పరిహారానికి బదులుగా, వారు ఈనాటికి కేవలం 470 మిలియన్ డాలర్ల (సుమారు 2,820 కోట్ల రూ॥) పరిష్కారానికి అంగీకరించి, భవిష్యత్తులో తలెత్తే సమస్య లన్నింటినుండి యుసిసిని విముక్తం చేశారు.

అత్యంత ఘోరంగా, ముష్టెత్తుకున్న రీతిలో జరిగిన ఈ ఒప్పందంపట్ల తీవ్ర నిరసనలు వ్యక్తమైన తర్వాత, కేవలం ప్రజల కళ్ళనీళ్ళు తుడవటంకోసం 5 సం॥ల క్రితం భారత పాలకులు సుప్రీంకోర్టులో 1.2. బిలియన్ డాలర్ల (సుమారు 7,200 కోట్ల రూ॥) పరిహారాన్ని కోరుతూ మరో పిటీషన్‌ను దాఖలు చేశారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు ఈ పిటీషన్‌పై వాదనలు వినే సమయం లేకపోయింది. అత్యవసరంగా పరిష్కరింపబడాల్సిందిగా పిటీషన్ ఇంతవరకు ముందుకు కదలలేదు.

అమెరికా సామ్రాజ్యవాదం, వారి బహుళజాతి కంపెనీల నిర్వాకం అలావుంటే, భారత పాలకుల, భారత న్యాయస్థానాల నిర్వాకం ఇలా వుంది. భోపాల్ గ్యాస్ బాధితులకు న్యాయం కలుగజేయటానికి, దశాబ్దాలు గడిచిపోతున్నా వారి కుటుంబాలకు పరిహారాన్ని అందజేసేందుకు, భూమిలోకి చొచ్చుకు పోయిన విషకాలుష్యాలను శుద్ధిచేసే చర్యలు చేపట్టేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టకుండా నిత్యం చస్తూ బతకాల్సిన స్థితికి నెట్టివేశారు.

అమెరికా సామ్రాజ్యవాదులు మరియు వారి సామ్రాజ్యవాద కార్పొరేషన్ సంస్థలు భారతదేశాన్ని, బాధిత ప్రజానీకాన్ని నిలువుగా దగా చేయటం మినహా ఇది వేరుకాదు.

మన పాలకుల, పాలకవర్గ ప్రతినిధుల వాస్తవ దళారీ స్వభావాన్ని వెల్లడిచేసేటందుకు, ఆ మేరకు ప్రజలలో చైతన్యాన్ని వ్యాప్తిచేసేందుకైనా భోపాల్ వినాశనానికి, దాని తదనంతర దుష్ప్రభావాలకు దానిని కొనుగోలు చేసిన డౌకెమికల్స్ సంస్థ బాధ్యత వహించి తీరాలనే డిమాండ్‌తో నిలకడైన ఆందోళన కొనసాగించాల్సిన అవసరం వుంది.

ooooo